సమస్యలుంటే సాక్షికి చెప్పండి

మీ సమస్యలు, ప్రజోపయోగ సూచనలు, ఇతర అంశాలను కింద ఫోన్ నంబర్‌కు వాట్సాప్ చేయండి

9705347494

నంబర్‌ను సంప్రదించండి

క్లుప్తంగా

పద్మనాభం బీసీ బాలుర వసతి గృహం తనిఖీ



మాట్లాడుతున్న తహసీల్దార్ ఆనందరావు

పద్మనాభం: మంచి మార్కులు తెచ్చుకుంటేనే ఉజ్వల భవిష్యత్ ఉంటుందని తహసీల్దార్ కె.ఆనందరావు విద్యార్థులకు సూచించారు. పద్మనాభం బీసీ బాలుర వసతి గృహాన్ని శుక్రవారం రాత్రి ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా విద్యార్థులనుద్దేశించి మాట్లాడారు. తల్లిదండ్రులు తమపై పెట్టుకున్న నమ్మకాన్ని వమ్ము చేయకుండా పిల్లలు చదువుకోవాలని హితవు పలికారు. భోజనం మెనూ సరిగ్గా అమలు చేస్తున్నారా? లేదా అని ఆరా తీశారు. ఆయన వెంట ఆర్ఐ శ్యామల ఉన్నారు.

ఔషధాల తయారీలో నాణ్యత తప్పనిసరి

కొమ్మాది: ఔషధాల తయారీలో నాణ్యత పాటించాలని, లేకుంటే దగ్గుమందు దుష్ప్రభావం వంటి విషాదాలు ఎదురవుతాయని గీతం స్కూల్ ఆఫ్ ఫార్మసీ ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ ఎల్. శ్రీనివాస్ అన్నారు. జాతీయ ఉత్తమ ఔషధ విధానాల తయారీ దినోత్సవంలో భాగంగా శుక్రవారం గీతంలో నిర్వహించిన ఓ కార్యక్రమంలో ఆయన ప్రసంగించారు. ఔషధ తయారీ రంగంలో ముడి పదార్థాల ఎంపిక నుంచి తుది ప్యాకింగ్ వరకు, ప్రతీ దశలో అత్యుత్తమ భద్రతా ప్రమాణాలు పాటించాలన్నారు. ప్రజల ఆరోగ్యం, రోగుల భద్రత కోసం మందుల నాణ్యతపై రాజీ లేకుండా ఉండటం ఎంతో ముఖ్యమని పేర్కొన్నారు. రాజస్థాన్‌లో డైఇథలీన్ గ్లైకాల్ కలుషితం వలన జరిగిన దగ్గు మందు విషాద ఘటనను ఉదాహరణగా చూపిస్తూ, ఔషధ తయారీ నిబంధనలు కచ్చితంగా అనుసరించాల్సిన అవసరాన్ని ఆయన వివరించారు.

దుర్గాలమ్మకు ప్రత్యేక పూజలు



పూజల్లో పాల్గొన్న భక్తులు

మధురవాడ: చంద్రంపాలెం జాతర గట్టు దుర్గాలమ్మ ఆలయంలో శుక్రవారం ప్రత్యేక పూజలు చేశారు. విశేష అభిషేకాల అనంతరం అమ్మవారిని అలంకరించి, దర్శనాలు కల్పించారు. చంద్రంపాలేనికి చెందిన దివంగత పిళ్లా జయపాల్ పాత్రుడు సతీమణి పిళ్లా మహాలక్ష్మి, కుటుంబ సభ్యుల సహకారంతో 300మందికి అన్నసమారాధన నిర్వహించారు. దాతలు పిళ్లా సంతోష్ కుమార్, ఆలయ కమిటీ అధ్యక్ష, కార్యదర్శులు పిళ్లా సూరిబాబు, నాగోతి తాతారావు, కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.


చెరువులో మేకల కాపరి మృతదేహం



అప్పారావు మృతదేహం

పద్మనాభం: మండలంలోని నేరేళ్లవలస పంచాయతీ విజయానందపురానికి చెందిన మేకల కాపరి సొంగ అప్పారావు (69) శుక్రవారం చెరువులో శవమై కనిపించాడు. పోలీసులు అందించిన వివరాలివి.. అప్పారావు గురువారం మధ్యాహ్నం ఒంటిగంట సమయంలో సారిక వారి కళ్లాల వైపు మేకలు తోలుకుని వెళ్లాడు. రాత్రి అయినా ఇంటికి తిరిగి రాలేదు. నేరేళ్లవలసలోని సారిక చెరువులో శుక్రవారం మధ్యాహ్నం 2.30గంటల సమయంలో అప్పారావు శవమై కనిపించాడు. దీనిపై మృతుడి భార్య ఈశ్వరమ్మ ఇచ్చిన ఫిర్యాదు మేరకు, కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

మాజీ ఎమ్మెల్యే తమ్మినకు నివాళి



తమ్మిన పోతరాజు చిత్ర పటం వద్ద నివాళులు అర్పిస్తున్న నాయకులు

మధురవాడ: కమ్యూనిస్ట్ నాయకుడు తమ్మిన పోతరాజు 113వ జయంతి సందర్భంగా నాయకులు ఘన నివాళులర్పించారు. మధురవాడ సీపీఐ కార్యాలయం వద్ద, ఏపీ నగరాలు కార్పొరేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి, అంజలి ఘటించారు. సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు మరుపిళ్ల పైడిరాజు, నగరాలు కార్పొరేషన్ డైరెక్టర్ నాగోతి సూర్యప్రకాశరావు, నగరాలు సంఘం జిల్లా కార్యదర్శి జగ్గుపిల్లి అప్పలరాజు, సీపీఐ నాయకుడు వి.సత్యనారాయణ పాల్గొన్నారు.

సెల్లార్లలో వ్యాపారాలు



ఎండాడ రోడ్డులో సెల్లార్‌లో వాణిజ్య సముదాయం

- రోడ్లపై పార్క్ చేస్తున్న వాహనాలు
- కమర్షియల్ కాంప్లెక్సుల్లో నిబంధనలకు తూట్లు
- బీచ్ రోడ్డు, ఎండాడ ప్రధాన రహదారిలో ట్రాఫిక్ పద్మవ్యూహం
- పట్టించుకోని అధికారులు, పోలీసులు

కొమ్మాది: కొంతమంది స్వార్థం వాహనదారులకు శాపంగా మారుతోంది. ముఖ్యంగా వాణిజ్య సముదాయాల వద్ద సెల్లార్లు కూడా ఆక్రమించి వ్యాపారాలు నిర్వహిస్తుండటంతో వాహనాలను రోడ్లపైనే పార్క్ చేయాల్సిన పరిస్థితి వస్తోంది. ఫలితంగా ఆ మార్గంలో రాకపోకలు సాగించే వారు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

ఎండాడ–రుషికొండ డబుల్ రోడ్డు ప్రధాన రహదారులన్నీ పార్కింగ్ స్థావరాలుగా మారిపోయాయి. ఈ ప్రాంతాల్లో బహుళ అంతస్తుల కమర్షియల్ నిర్మాణాలు జరిగిన నేపథ్యంలో, ఎక్కడా సెల్లార్లు లేకపోవడంతో నేరుగా రోడ్డుమీదే వాహనాలు పార్క్ చేయాల్సిన పరిస్థితి ఏర్పడుతోంది. దీంతో ట్రాఫిక్ అంతరాయం రోజురోజుకూ పెరిగిపోతోంది. ఏ చిన్న వాహనం వచ్చినా గంటల తరబడి వేచి ఉండాల్సిన పరిస్థితి ఏర్పడుతోంది.

ట్రాఫిక్ క్రమబద్ధీకరణలో విఫలం

8వ వార్డు పరిధి రుషికొండ, సాగర్‌నగర్ ప్రాంతంలో పలు కళాశాలలు, పర్యాటక ప్రాంతాలు, ఆధ్యాత్మిక కేంద్రాలు ఉండటంతో ప్రధాన రోడ్డులో ట్రాఫిక్ సమస్య రోజురోజుకూ పెరిగిపోతోంది. రోజూ పెరుగుతున్న రద్దీని నియంత్రించలేక అధికారులు చేతులు ఎత్తేస్తున్నారు. ఇక, ఈ ప్రాంతాల్లో కొన్ని పీఎం పాలెం పోలీస్‌స్టేషన్ పరిధి, మరికొన్ని ఆరిలోవ పోలీస్ స్టేషన్ పరిధిలోకి రావడంతో సమస్య తమది కాదంటే తమది కాదని పోలీసులు తప్పించుకుంటున్నారు. అయితే ద్విచక్ర వాహనాల నుండి భారీ వాహనాల వరకు రోడ్డుమీదే పార్కింగ్ చేయడంతో రోడ్డు ప్రమాదాలు జరిగిన సంఘటనలు కూడా అనేకం. ఇప్పటికైనా జీవీఎంసీ పట్టణ ప్రణాళిక విభాగం అధికారులు, పోలీసులు సమన్వయంతో ఈ సమస్యను పరిష్కరించాలని స్థానికులు కోరుతున్నారు.

ప్రధాన కూడళ్లలో ఇదీ పరిస్థితి..

- ఎండాడ–రుషికొండ వంద అడుగుల రహదారిలో రోడ్డుకు ఇరువైపులా భారీ కమర్షియల్ నిర్మాణాలు నిర్మించారు. సెల్లార్లలో వాణిజ్య సముదాయాలు ఏర్పాటు చేయడంతో రోడ్లపైనే ద్విచక్రవాహనాలు, కార్లు పార్క్ చేస్తున్నారు.
- ప్రముఖ పర్యాటక ప్రాంతం రుషికొండ బీచ్‌కు వెళ్లేదారిలో వందలాది వాహనాలు రోడ్డుమీదే పార్క్ చేస్తున్నారు.
- విశాఖ–భీమిలి బీచ్ రోడ్డు మార్గమధ్యలో రుషికొండ రోడ్డును ఆనుకుని కొన్ని ఫుడ్ కోర్టులు ఉన్నాయి. కానీ ఎక్కడా పార్కింగ్ స్థలం కేటాయించలేదు. దీంతో ప్రధాన రహదారులపైనే వాహనాలు పార్క్ చేయాల్సిన పరిస్థితి ఏర్పడుతోంది. దీనికి తోడు బీచ్ రోడ్డు వెంబడి బార్ అండ్ రెస్టారెంట్లు అధికమయ్యాయి. వీటికి కూడా ఎక్కడా పార్కింగ్ స్థలాలు కేటాయించలేదు. నిబంధనల ప్రకారం పార్కింగ్ స్థలం చూపిస్తే తప్ప జీవీఎంసీ అనుమతులు ఉండవు. కానీ ఈ అనుమతులన్నీ కేవలం కాగితాలకు మాత్రమే పరిమితం కావడమే ఈ దుస్థితికి కారణం.



రుషికొండ రోడ్డులో సెల్లార్‌లో దుకాణాలు



ఎండాడ డబుల్‌రోడ్డులో పార్క్ చేసిన వాహనాలు

రోడ్డు ఎక్కాలంటే భయం



విశాలమైన రోడ్డు ఉన్నా ఆ రోడ్డుమీదే వాహనాలు పార్క్ చేయడం వలన ట్రాఫిక్‌లో చిక్కుకుపోతున్నాం. ముఖ్యంగా ఎండాడ వంద అడుగుల రోడ్డు వద్ద వాణిజ్య సముదాయాలు బాగా పెరిగాయి. వీటి వలన ఇక్కడ ట్రాఫిక్ సమస్య రోజురోజుకూ పెరిగిపోతోంది. అధికారులు పరిశీలించి ట్రాఫిక్ సమస్యను పరిష్కరించాలి.

– దువ్వి వాసు, సాగర్‌నగర్

నిఘా ఏర్పాటు చేయాలి



వ్యాపార నిర్మాణాలు చేపట్టేముందు అధికారులు ప్రత్యేక నిఘా ఏర్పాటు చేసి, అనుమతులు పరిశీలించాలి. అదే విధంగా వ్యాపార సముదాయాల ముందు పార్క్ చేసిన వారిపై పోలీసులు ఎప్పటికప్పుడు ఫైన్లు వేస్తే ట్రాఫిక్ సమస్య పరిష్కరించవచ్చు. ట్రాఫిక్ కారణంగా 10 నిమిషాల్లో చేరుకోవలసిన ప్రాంతానికి అరగంట పడుతుంది.

– బొబ్బిలి చిన్న, ఎండాడ

22 నుంచి మాలధారులకు అన్నప్రసాద వితరణ



అన్నప్రసాద కరపత్రాలను ఆవిష్కరిస్తున్న సేవా సంఘ ప్రతినిధులు

భీమునిపట్నం: భీమిలి బీచ్ సమీపంలోని అయ్యప్ప ధ్యాన మందిరం వద్ద ఈ నెల 22 నుంచి డిసెంబర్ 8వ తేదీవరకు అయ్యప్ప స్వాములు, భవానీ మాలధారులకు ప్రతిరోజు మధ్యాహ్నం అన్న ప్రసాద వితరణ జరుగుతుందని వీరాంజనేయ అయ్యప్ప సేవా సంఘం అధ్యక్షుడు కొమ్మినేని ఎర్రునాయుడు తెలిపారు. కార్యక్రమ కరపత్రాలను శుక్రవారం ధ్యానమందిరంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎర్రునాయుడు మాట్లాడుతూ ప్రతీ సంవత్సరంలానే ఈ ఏడాది కూడా మాలధారులకు అన్న సమారాధన ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు. ఇక్కడి ధ్యాన మందిరం వద్ద 22వ తేదీన భక్తులు అయ్యప్ప దీక్షలను స్వీకరిస్తారని వెల్లడించారు. కార్యక్రమంలో సంఘం ప్రధాన కార్యదర్శి మొకర నర్సింగరావు, కోశాధికారి పిల్లి శ్రీను, ఉపాధ్యక్షులు కదిరి జగన్నాథం, సహాయ కార్యదర్శి కొండ్రు గోవిందరాజు, పురోహితులు సుసరాపు మాధవశాస్త్రి, సభ్యులు పాల్గొన్నారు.

ఉత్సాహంగా ఫ్రెషర్స్ డే వేడుకలు

తగరపువలస: స్థానిక శ్రీబాసర జూనియర్ కళాశాల ఫ్రెషర్స్ డే వేడుకలు బైపాస్‌రోడ్డులోని ఎంఎస్ఆర్ ఫంక్షన్ హాల్లో శుక్రవారం ఘనంగా జరిగాయి. ఉత్తమ ప్రతిభ కనపరిచిన విద్యార్థులకు శ్రీబాసర విద్యాసంస్థల చైర్మన్ పూడి రమేష్ నగదు బహుమతులు, మొమెంటోలు అందించారు. విద్యార్థులు సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. ఎస్.సతీష్, జోనల్ ప్రిన్సిపాల్ రమేష్, డిఫెన్స్ ప్రిన్సిపాల్ మహేశ్వరరెడ్డి, డీన్ మజ్జి భాస్కరరావు తదితరులు పాల్గొన్నారు.

ప్రతి ఒక్కరికీ మానసిక ఆరోగ్యం ముఖ్యం



అవగాహన కార్యక్రమంలో వాసవ్య మహిళా మండలి సిబ్బంది



మెంటల్ హెల్త్ అక్షరాకృతిలో ఏర్పడిన కృష్ణాపురం కేజీబీవీ విద్యార్థులు

తగరపువలస: ప్రతి ఒక్కరూ ఆరోగ్యంగా జీవించడానికి మానసిక ఆరోగ్యం అవసరమని వాసవ్య మహిళా మండలి సాంత్వన ప్రాజెక్ట్ కో–ఆర్డినేటర్ గోపీచంద్ అన్నారు. ప్రపంచ మానసిక ఆరోగ్య దినోత్సవం సందర్భంగా లివ్ లవ్ లాఫ్ ఫౌండేషన్‌తో కలిసి శుక్రవారం ఆనందపురం మండలం మామిడిలోవ వెల్‌నెస్ సెంటర్‌లో మానసిక ఆరోగ్యంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. శారీరక ఆరోగ్యంతో సమానంగా మానసిక ఆరోగ్యాన్ని పరిరక్షించుకోవాలని, అదే జీవిత నాణ్యతను పెంచుతుందని తెలిపారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి సత్యప్రసాద్, సూపర్‌వైజర్లు నాగరాజు, హేమ, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

మానసిక ఆరోగ్యం బాగుంటేనే చదువుపై ఏకాగ్రత

పద్మనాభం: మానసిక ఆరోగ్యం బాగున్నప్పుడే చదువుపై ఏకాగ్రత ఉంటుందని జిల్లా కెరీర్ అండ్ మెంటల్ హెల్త్ కౌన్సెలర్ కృష్ణవేణి అన్నారు. మానసిక ఆరోగ్య దినోత్సవం సందర్భంగా మండలంలోని కృష్ణాపురం కస్తూర్బా విద్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. విద్యార్థినులందరూ మానసిక ఆరోగ్యాన్ని పెంపొందించుకోవాలన్నారు. మానసిక ఆరోగ్యం గురించి ప్రతిజ్ఞ చేశారు. ఈ సందర్భంగా విద్యార్థినుల మెంటల్ హెల్త్ ఇంగ్లిష్ అక్షరాల ఆకృతి ఆకట్టుకుంది. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ గ్రేస్ లిల్లీ, సీఆర్టీలు పాల్గొన్నారు.

వినూత్న ఆవిష్కరణల దిశగా సాంకేతిక ఉత్సవాలు



మాట్లాడుతున్న జేఎన్‌టీయూవీ అకడమిక్ ప్లానింగ్ డైరెక్టర్ చంద్రభూషణరావు

తగరపువలస: విద్యార్థులలో దాగి ఉన్న సాంకేతిక నైపుణ్యాలు, ప్రతిభలను వెలికితీసి, వినూత్న ఆవిష్కరణల దిశగా తీసుకువెళ్లేందుకు సాంకేతిక ఉత్సవాలు దోహదం చేస్తాయని జేఎన్‌టీయూ–విజయనగరం అకడమిక్ ప్లానింగ్ డైరెక్టర్ ప్రొఫెసర్ ఎస్.చంద్రభూషణరావు అన్నారు. ఆనందపురం మండలం శొంఠ్యాం ఎస్ఎస్ఆర్ఐటీలో రెండురోజుల పాటు జరగనున్న జాతీయస్థాయి సాంకేతిక ఉత్సవం టెక్నింబుల్–2025ను శుక్రవారం ఆయన ప్రారంభించారు. రాష్ట్రంలో వివిధ ఇంజినీరింగ్ కళాశాలల నుంచి 1200 మంది విద్యార్థులు ఈ ఉత్సవాలలో పాల్గొన్నారు. ఇందులో పోస్టర్, పేపర్ ప్రెజెంటేషన్, టెక్నికల్ హంట్, డ్రోన్ ఎక్స్‌పో, ఫిల్మ్ మేకింగ్, సైబర్ సెక్యూరిటీ అభివృద్ధి, సాంకేతిక పోటీలు, ప్రదర్శనలు నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ప్రిన్సిపాల్ ఎస్.శంభుప్రసాద్, చీఫ్ మేనేజ్‌మెంట్ అధికారి పి.ఎస్.రాజు, కోశాధికారి ఎస్.కనకరాజు, కన్వీనర్ కె.శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన కనకమ్మ ఉత్సవాలు



దివిటీలతో అమ్మవారిని తోడ్కొని వస్తున్న గ్రామస్తులు



ప్రత్యేక అలంకరణలో కనకమ్మ

తగరపువలస: భీమిలి మండలం చిప్పాడ గ్రామదేవత కనకమ్మ ఉత్సవాలు శుక్రవారంతో ముగిశాయి. గురువారం అర్ధరాత్రి చిప్పాడ అనుబంధ 14 గ్రామాల ప్రజలు చొప్పకర్రలు దివిటీలుగా చేసుకుని వెలిగిస్తూ, అమ్మవారిని గ్రామశివారు ఆలయం నుంచి గ్రామంలోనికి తోడ్కొని వచ్చారు. తిరిగి శుక్రవారం అమ్మవారిని ఊరేగింపుగా ఆలయం వరకు తీసుకు వెళ్లి అనుపు ఉత్సవం నిర్వహించారు. అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించారు. కోలాటం, బాణసంచాలతో ఆ ప్రాంతమంతా సందడి నెలకొంది. భక్తులు అమ్మవారికి మొక్కులు చెల్లించారు.

దర్జాగా కబ్జా



భూలోకమ్మ ఆలయం వద్ద వెలసిన షెడ్డు

తగరపువలస: ఆనందపురం మండలం లొడగలవానిపాలెం పంచాయతీలో ప్రభుత్వ స్థలాలు యథేచ్ఛగా కబ్జాకు గురవుతున్నా, పక్కనే ఉన్న రెవెన్యూ అధికారులు చూసీచూడనట్టుగా వ్యవహరిస్తున్నారు. ఇప్పటికే ఈ ప్రాంతంలో పలు స్థలాలు కబ్జా చేసి షెడ్లు నిర్మించి అద్దెలు వసూలు చేసుకుంటున్న టీడీపీకి చెందిన పంచాయతీ పాలకవర్గ సభ్యుడు గురువారం మరో షెడ్డు వేశాడు. వీటికి విద్యుత్ శాఖ అధికారులు కూడా ఎలాంటి డాక్యుమెంట్లు లేకపోయినా విద్యుత్ మీటర్లు కళ్లుమూసుకుని మంజూరు చేస్తున్నారు. ఈ విషయాన్ని వీఆర్వో అప్పారావు దృష్టికి తీసుకురాగా పరిశీలించి చర్యలు తీసుకుంటామన్నారు.

సేవానగర్‌లో స్వచ్ఛభారత్

కొమ్మాది: జీవీఎంసీ జోన్–2 కొమ్మాది దరి సేవానగర్‌లో శుక్రవారం బీజేపీ ఎస్సీ మోర్చా ఆధ్వర్యంలో స్వచ్ఛభారత్ నిర్వహించారు. ఎస్సీ మోర్చా అధ్యక్షుడు గనిరెడ్డి రాకేష్ చంద్ర ఆధ్వర్యంలో ఈ ప్రాంతంలో పేరుకుపోయిన వ్యర్థాలు, కాల్వల్లో నిండిపోయిన చెత్తను శుభ్రపరిచారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు, స్థానికులు పాల్గొన్నారు.


నేత్రపర్వం.. దామోదర దీపోత్సవం



ప్రత్యేక అలంకరణలో శ్రీరాధా మదన్ మోహనులు

తగరపువలస: హరేకృష్ణ మూవ్‌మెంట్ ఆధ్వర్యంలో గంభీరం ఐఐఎంవీ రోడ్డులోని హరేకృష్ణ వైకుంఠంలో శ్రీరాధా మదన్ మోహనుల మందిరంలో దామోదర దీపోత్సవం కనులపండువగా జరుగుతోంది. హరేకృష్ణ మూవ్‌మెంట్ అధ్యక్షుడు నిష్కించిన భక్తదాస మాట్లాడుతూ కార్తీకమాసంలో ప్రతి ఒక్కరూ కార్తీక వ్రతాన్ని ఆచరించాలన్నారు. శ్రీకృష్ణునికి నెయ్యి దీపం అర్పించాలన్నారు. వ్యాస మహర్షి రచించిన పద్మ పురాణంలోని దామోదర అష్టకాన్ని రోజూ పాడాలని తెలిపారు. కార్యక్రమంలో అంబరీష దాస తదితరులు పాల్గొన్నారు.

ఎన్ఎంఎంఎస్ విద్యార్థులకు మోడల్ పరీక్ష



మోడల్ పరీక్ష రాస్తున్న విద్యార్థులు

తగరపువలస: ఎన్ఎంఎంఎస్‌కు హాజరు కానున్న విద్యార్థులకు చిట్టివలస జెడ్పీ హైస్కూల్‌లో ఫ్రెండ్స్ ఎడ్యుకేషనల్ సొసైటీ ఆధ్వర్యంలో ఉచిత శిక్షణ అందిస్తున్న సంగతి తెలిసిందే. అందులో భాగంగా శుక్రవారం శిక్షణ పొందుతున్న విద్యార్థులకు మోడల్ పరీక్ష–1 నిర్వహించారు. 50 మంది విద్యార్థులు ఈ పరీక్ష రాయగా వీరికి విశ్రాంత కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ నరేంద్రకుమార్, గ్రామీణ వైద్యుల సంఘం ఉత్తరాంధ్ర అధ్యక్షుడు జంగం జోషి మోడల్ పేపర్లను సమకూర్చారు. సొసైటీ వ్యవస్థాపకుడు గంటాన మోహనరావు, ప్రధాన కార్యదర్శి రేఖ అప్పారావు, ప్రధానోపాధ్యాయులు డి.ఆదినారాయణ, శివజ్యోతి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ కార్యకర్త పోస్టులకు 20 దరఖాస్తులు

మత్రిపాలెం: ఐసీడీఎస్ అర్బన్ పరిధిలోని పలు అంగన్‌వాడీ కేంద్రాల్లో కార్యకర్తలు, ఆయాల నియామకానికి ప్రభుత్వం ఇటీవల నోటిఫికేషన్ విడుదల చేసింది. నగరంలో 2 కార్యకర్తల పోస్టులు, 21 ఆయాల పోస్టులను భర్తీ చేసేందుకు దరఖాస్తులు స్వీకరించారు. రెండు కార్యకర్తల పోస్టులకు సంబంధించి శుక్రవారం సాయంత్రంతో గడువు ముగిసింది. కార్యకర్తల పోస్టులకు మొత్తం 20 దరఖాస్తులు వచ్చినట్టు అర్బన్ సీడీపీవో నీలిమ ఒక ప్రకటనలో తెలిపారు. ముస్లిం తాటిచెట్లపాలెం నుంచి 13, మద్దిలపాలెం నుంచి 7 దరఖాస్తులు వచ్చినట్లు చెప్పారు. ధ్రువపత్రాల పరిశీలనకు సంబంధించి దరఖాస్తు చేసుకున్న వారికి నేరుగా ఫోన్ ద్వారా సమాచారం అందిస్తామన్నారు.

కొయ్యపేటలో కేజీహెచ్ బృందం పర్యటన

డయేరియా నేపథ్యంలో పరిస్థితులపై ఆరా



రక్షిత మంచి నీటి పథకం పరిసర ప్రాంతాలను పరిశీలిస్తున్న కేజీహెచ్ వైద్య బృందం



కొయ్యపేటలో డయేరియా వ్యాధిగ్రస్తులతో మాట్లాడుతున్న బృంద సభ్యులు

పద్మనాభం: మండలంలోని నేరేళ్లవలస పంచాయతీ కొయ్యపేటలో 18 మంది డయేరియా బారిన పడటంతో ముగ్గురు వైద్యులతో కూడిన కేజీహెచ్ రాపిడ్ రెస్పాన్స్ బృందం శుక్రవారం గ్రామంలో పర్యటించింది. డయేరియా ప్రబలడానికి కారణాలపై ఆరా తీసింది. జనరల్ మెడిసిన్‌కు సంబంధించి డాక్టర్ జగదీశ్వరరావు, కమ్యూనిటీ మెడిసిన్ విభాగానికి చెందిన డాక్టర్ ప్రతిమ, మైక్రో బయాలజీ విభాగానికి చెందిన డాక్టర్ శిరీషలతో కూడిన బృందం డయేరియా వ్యాధికి గురైన వారి ఇళ్లకు వెళ్లి, వ్యాధి బారిన పడడానికి కారణాలను తెలుసుకుంది. వారు ఏ ఆహార పదార్థాలు తిన్నారో వారు అడిగి తెలుసుకున్నారు. రక్షిత మంచినీటి పథకం పరిసర ప్రాంతాలను పరిశీలించారు. గ్రామంలో కొనసాగుతున్న వైద్య శిబిరాన్ని సందర్శించి, మందులను పరిశీలించారు. రోగులు చెప్పిన విషయాల మేరకు సమగ్ర నివేదిక తయారు చేసి, డీఎంహెచ్‌వోకు అందించనున్నట్లు బృందం సభ్యులు తెలిపారు. వారి వెంట రేవిడి పీహెచ్‌సీ వైద్యాధికారి కె.లీలా ప్రసాద్, ఎంపీహెచ్ఈవో శ్రీనివాసరావు ఉన్నారు. రీజనల్ లేబరేటరీకి పంపిన నీటి శాంపిల్స్, కేజీహెచ్‌కు పంపిన మోషన్ శాంపిల్స్ ఫలితాలు ఇంకా రాలేదు.

డ్రైనేజీలు పరిశుభ్రం

గ్రామంలోని డ్రైనేజీలను శుక్రవారం కూడా శుభ్రం చేశారు. సైడు కాలువల్లోని చెత్త చెదారాన్ని తొలగించారు.

ఐసీడీఎస్ పీవో, కార్యకర్తలపై ఆర్డీవో ఆగ్రహం

చర్యలకు ఆదేశం



తాళ్లవలస అంగన్‌వాడీ కేంద్రంలో భీమిలి ఆర్డీవో సంగీత్ మాథూర్



అపరిశుభ్రంగా ఉన్న నేలపై కూర్చుని తింటున్న చిన్నారులు

తగరపువలస: అంగన్‌వాడీ కేంద్రంలో చిన్నారుల సంరక్షణ సరిగ్గా లేకపోవడంతో ఆగ్రహం వ్యక్తం చేసిన ఆర్డీవో సంగీత్ మాథూర్, ఐసీడీఎస్ పీవో, కార్యకర్తలపై చర్యలకు ఆదేశించారు. తాళ్లవలస పంచాయతీలో శుక్రవారం ఆర్డీవో పర్యటించారు. ఈ సందర్భంగా ఎస్సీ కాలనీ, యాతపేట అంగన్‌వాడీ కేంద్రాలలో కుర్చీలు ఉన్నా.. చిన్నారులను అపరిశుభ్ర వాతావరణంలో, నేలపై కూర్చోబెట్టి ఆహారం అందించడంతో ఆగ్రహం వ్యక్తం చేశారు. టాయిలెట్లు కూడా శుభ్రంగా లేకపోవడంతో అసంతృప్తి వ్యక్తం చేశారు. బాలింతలు, గర్భిణులు, చిన్నారులకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా అందిస్తున్న సంక్షేమ పథకాల పేర్లు గురించి అడగ్గా వారు చెప్పలేకపోవడంతో ఆశ్చర్యం వ్యక్తంచేశారు. ప్రభుత్వం అందిస్తున్న పథకాలపై అవగాహన లేకుండా పౌష్టికాహారం ఎలా పంపిణీ చేస్తున్నారనే అనుమానం వ్యక్తం చేశారు. రిజిస్టర్‌లో 10 మంది చిన్నారులు ఉండగా కేంద్రంలో నలుగురు పిల్లలే ఉండటంపై ఆరా తీశారు. ఐసీడీఎస్ భీమిలి పీవో శ్రీదేవితో పాటు యాతపేట, ఎస్సీ కాలనీ అంగన్‌వాడీ నిర్వాహకులపై చర్యలకు ఆదేశించారు.

అనంతరం తాళ్లవలస పీహెచ్‌సీ, జెడ్పీ హైస్కూల్, గ్రామ సచివాలయాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా ఆర్డీవో మాట్లాడుతూ ప్రతి శుక్రవారం ప్రత్యేక అధికారుల పర్యవేక్షణలో ఆకస్మిక తనిఖీలు ఉంటాయన్నారు. విధుల నిర్వహణలో అలసత్వం వహిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. ఆయన వెంట డిప్యూటీ తహసీల్దార్ ప్రసాద్, ఎంపీడీవో నరసింహారావు, ఎంపీటీసీ సభ్యుడు కోరాడ రమణ, ఎంఈవో శివరాణి, సచివాలయ సిబ్బంది ఉన్నారు.

ఫౌంటైన్, పైలాన్ ఆధునికీకరణ



పైలాన్ చుట్టూ బొమ్మలకు మరమ్మతులు



గత ప్రభుత్వ హయాంలో ఆకర్షణీయంగా ఉన్న ఫౌంటైన్ (ఫైల్)

భీమునిపట్నం: భీమిలి బీచ్ సమీపంలోని బీచ్‌రోడ్డు మధ్యలో ఉండే ఫౌంటైన్, దాని చుట్టూ ఉన్న ప్రాంతం, పక్కనే ఉన్న పైలాన్‌కు అధికారులు రూ.15 లక్షలతో మరమ్మతులు నిర్వహిస్తున్నారు. ఇక్కడ 20 సంవత్సరాల క్రితం అప్పటి మున్సిపల్ చైర్మన్ డి.శైలేంద్రరెడ్డి ఈ ఫౌంటైన్‌ను ఏర్పాటు చేశారు. క్రమేణా ఇది బాగా దెబ్బతిని పాడవడంతో, మూడేళ్ల క్రితం వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో చేపట్టిన బీచ్ అభివృద్ధి పనుల్లో భాగంగా ఈ ఫౌంటెన్‌కు మరమ్మతులు, రంగులు వేయడంతో పాటు లైటింగ్ కూడా ఏర్పాటు చేశారు. ఇది ప్రత్యేక ఆకర్షణగా నిలవడంతో సందర్శకులు ఇక్కడ ఎక్కువగా ఫొటోలు తీసుకునేవారు. తర్వాత కాలంలో పర్యవేక్షణ సరిగ్గా లేకపోవడంతో పాడైపోయింది. కాగా, ఇప్పుడు మళ్లీ మరమ్మతులు చేస్తున్నారు. అందులో భాగంగా ఫౌంటైన్ చుట్టు ఉన్న ఖాళీ ప్రదేశంలో టైల్స్ ఏర్పాటు చేస్తున్నారు. ఫౌంటైన్‌ను బాగుచేయడంతో పాటు లైటింగ్ కూడా ఏర్పాటు చేస్తున్నారు. పక్కనే ఉన్న పైలాన్‌కు కూడా మరమ్మతులు చేసి రంగులు వేయనున్నారు.